బలహీనపు ఘడియ

మేడమీద గదిలో పడకకుర్చీలో పడుకుని పాతపత్రికలు తిరగేస్తోంది హేమ. తెగచదవటం మొదటనుంచీ అలవాటు ఏ పత్రిక కనిపించినా సరే సొంతం చదవందే కదలదు. ఇప్పటికి ఎన్ని కథలు, ఎన్ని నవలలు చదివిందో అంతులేదు. రకరకాల మనస్తత్వాలు, రకరకాల పరిస్థితులు యెన్నెన్నో అవగాహన చేసుకుంది. ఆత్మవిశ్వాసం యెన్నోరెట్లు పెరిగిపోయింది.

ఎం. ఏ. ప్యాసయినా అంత పెద్దచదువు చదివినట్టుగా అసలే కనబడదు. అణుకువ ఆమె ప్రధాన లక్షణం. ఓ నాడు ఎప్పుడయినా పనిమనిషి రావటం ఆలస్యమయితే అమాంతం ఓ చీపిరికట్ట పట్టుకుని కసువు వూడుస్తుంది. వంట మనిషికోసం ఎదురు చూస్తూ కూర్చోదు. టైము ప్రకారం భోజనాలు కావాల్సిందే. ఒళ్ళొంచి పనిచెయ్యటం ఆమెకు మొదటనుంచీ అలవాటే.

ఎంత పనిఒత్తిడిలోవున్నా మాట్లాడేటప్పుడు తూచి తూచి మాట్లాడుతున్నట్లు కనిపిస్తుంది. ఎంతసేపూ యితరుల అభిప్రాయం యేమిటా అని తెలుసుకోవటానికి తంటాలు పడుతుంది. అందు వల్లనే ఆమెతో మాట్లాడటం యెవరికైనా సరదాగానే వుంటుంది. ఇతరులనునొప్పిస్తూ తానెట్లాగూ మాట్లాడదు. ఇంకొకరెవరైనా మాట్లా డినా కూడా ఓర్చుకోలేదు. విలవిలలాడిపోతుంది. సూటిపోటి మాటలనటం అసలామెకు గిట్టదు అవగాహన ఆమెలో ఒక ప్రత్యే కత.

కృష్ణకూడా నిజానికి భార్యకంటె సరదా మనిషే. పెద్ద ఉద్యోగం, మంచి ప్రాపకం గలవ్యక్తి ఎప్పటికప్పుడు ఎవరికో ఒకరికి తానేవిధంగానైనాసరే ఉపయోగపడాలని తహతహ లాడుతూ వుంటాడు. ఎవరొచ్చి ఏదడిగినా తన కున్నంతలో కాదనే స్వభావం లేదు. ఏ బంధువో, స్నేహితుడో వస్తేసరి, తనింట్లో రెండు మూడు రోజులు ఆతిథ్యం యిస్తేగాని పంపించడు అది అతనికి మహా సంతోషం. ఇతరులను 'రిసీవ్' చేసుకోవటం అంటే మహాసరదా. హేమ సభ్యతకు అవగాహనకు యెంతగానో మురిసి పోతూవుంటాడు ఆమె మీద అపరిమితమైన గౌరవం, అభిమాన మూను ప్రేమ సరేసరి. ఆమె తెలివితేటలమీద యెంతో నమ్మకం. ఆమె ఏం పనిచేసినా, ఏ మాట మాట్లాడినా దాంట్లో యెంతో అర్థం వుందని ఆమెను పొగుడుతూవుంటాడు. తనకేదైనా సమస్య ఆఫీ సులోగాని, యింట్లోగాని యెదురయితే చప్పున కళ్ళుమూసుకుని 'హేమా' అనుకుంటాడు. ఏదో పరిష్కార మార్గం ఆ సమయానికి తనకు స్ఫురించినట్లు ఆనందపడిపోతూవుంటాడు ఆఫీసునుంచి యింటికి యెప్పుడొచ్చిపడదామా అని పనులన్నీ చకచక పూర్తి

చేసుకుంటూ వుంటాడు ఆమెకూడా అతనికోసం వెయ్యి కళ్ళు పెట్టుకుని ఎదురుచూస్తూ వుంటుంది.

ఆనాడు సాయంత్రం తీరిగ్గా కూర్చుని ఏవేవో చదువుతోంది. టైము తెలియలేదు. అప్పటికే ఆరుగంటలు దాటింది. ఆయన ఇంకా రాలేదేమా అనుకుంటూ బద్ధకంగా లేచి ఒళ్ళు విరుచుకుంటూ గది కిటికీ దగ్గర నిలబడింది. అన్నిచోట్ల దీపాలు వెలిగి వున్నాయి. చీకటి వెలుగులు ఒకదానివెంట ఒకటి చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నాయి.

వచ్చేకారు పోయేకారు. బజారంతా జనంతోకిటకిటలాడుతోంది. అట్లాగే చూస్తూ చాలాసేపటివరకు ఏవో ఆలోచనల్లో మునిగి పోయింది.

ఎప్పుడయినా ఆయన లేటుగా రావటం కూడా కద్దు. బహుశా అనుకోకుండా యివ్వాళ యేదో అర్జంటు పనివచ్చి వుంటుంది. అందువల్లనే యింత ఆలస్యమయింది. తనలో తాను సమాధానపడుతోంది కాని క్షణంలో మనస్సు పరిపరి విధాల పోతోంది వెనక్కి తిరిగివచ్చి కుర్చీలో కూర్చుంది. అప్రయత్నంగా చేతిలోకి ఓ నవల తీసుకుంది. పేజీలు తిప్పుతోందే కాని చదవబుద్ధి పుట్టటంలేదు. కృష్ణ అన్న మాటలు యిట్టే గుర్తుకొచ్చాయి.

'అవును నే కూడా నవలలను రాయగలను' సందేహం యేమిటి అనుకుంది తనలో తాను.

'ముందర ఓ చిన్న కథ రాసి ఆయనకు చూపిస్తాను. దేన్ని గురించి రాయాలి, ఎవర్ని గురించి రాయాలి.' మళ్ళీ ఆలోచన

మొదలు పెట్టింది. చప్పున కళ్ళుమూసుకుంది. ఆలోచన తళుక్కున మెరసింది.

నేనే కనక రాయటం మొదలు పెడితే ముందరగా ఆ శ్రీధర్‌ను గురించే రాయాలి. అచ్చవంగానే వెంటనే ఓ కాపీ అతనికి పంపుతా— బహుశా నా సహనాన్ని పరీక్ష చెయ్యటానికి అతను దాపరించాడనుకుంటా. ఛీ! అతన్ని గురించి ఆలోచించటం యేమిటి? తల విదిలించేసుకుంది. కసిగా, విసుగ్గా ఆ పుస్తకాన్ని గిరాటు పెట్టింది. కళ్లుమూసుకుని నిట్టూరుస్తోందేగాని శ్రీధర్ తన కళ్ళల్లోంచి కదిలిపోలేదు.

'మీ భర్తగా రొస్తున్నట్టున్నారు. మనిద్దరం యిట్లా కబుర్లు చెప్పుకుంటుంటే ఆయనేమైనా అనుమానపడచ్చు...' శ్రీధర్ మాటలు గుర్తుకొచ్చి గగుర్పొడిచింది. ఆయన్ని గురించి యెంత అవమానంగా మాట్లాడాడు! ఎంత ధీమా దిలాసా అనుకుంది.

'మా వారిమీద మీకున్న అభిప్రాయానికి చాలా థాంక్స్....' బాగానే బుద్ధిచెప్పా. ఆమాత్రం అతనికి తెలిసివుంటే మళ్ళీ యింకోసారి అలాంటి పొరపాటు మాటలు అనడు. తనలో తాను తృప్తి పడింది.

శ్రీధర్ నోటి దూకుడుకు ఆయనా మంచి సమాధానమే చెప్పారు.

'మి మాటలకు పిచ్చివాడినయిపోయి హేమను శంకించేటంత నీచుణ్ణిమాత్రంకాదు....శ్రీధర్ యిహ నీ ప్రయత్నాలు విరమించవచ్చు.... అబ్బ ఎంతస్ట్రెయిట్‌గా పాయింటెడ్‌గా సమాధానం చెప్పారు అనుకుంది.

'ఏమిటీ అప్పుడే ఎనిమిదికూడా అవుతోందా!' రిస్ట్ వాచ్ చూసుకుని ఆశ్చర్యపోయింది. తాను కూర్చున్న మేడపై గదిలోనే పచార్లు చేస్తోంది అలసటగా. అప్పుడప్పుడు ఏదో అలికిడయినట్టు ఊహించుకుంటూ మెట్లవైపు చూస్తోంది.

'అబ్బా యివ్వాళ యింటికి యింకా రాలేదేమిటి!....' అలజడిగా అనుకుంటోంది.

'అసలు ఆయన చేసిన పనే నాకేమాత్రం యిష్టంలేదు. శ్రీధర్ చీటికి మాటికి మనింటికి రావటం!....అవునూ శ్రీధర్ అంటే నాకు చెడ్డ అసహ్యం నీకుతెలుసా హేమా'అని నాతో అన్నారుకూడా ఆయనకు అసహ్యం. నాకేనా అతనంటే ప్రేమ .... తనలో తాను నవ్వుకుంది. తాను అప్రయత్నంగా 'ప్రేమ' అన్నందుకు నొచ్చుకుంది. ఏమిటిట్లా అన్నాను శరీరం ఒక్కక్షణం వణికింది — ఉలిక్కిపడ్డట్టయింది. వీపుమీద యెవరో చరిచినట్లు చప్పున వెనక్కు తిరిగింది.

'ఆయన మరీ సెంటిమెంటల్. పైకి ఏమీ అనలేరు. శ్రీధర్ వస్తే ఒళ్ళు పై తెలీదు గంటలు గంటలు కూర్చుని మాట్లాడతారు. దానికి అంతుండదు. పైగా నన్నుకూడా అక్కడ కూర్చోమంటారు. నా కక్కడ ఒక్క క్షణం కూడా కూర్చోబుద్ధి పుట్టదు. కర్టెసీ కోసం కూర్చోక తప్పదు. కూర్చోకపోతే అనవసరమైనమిసండర్స్టాండిగ్. ఏమైనా కాని యీసారి కనక వస్తే నేనే చెప్పేస్తా.... ఎవరేమనుకున్నా సరే....' హేమ మొహాన్ని అద్దుకుంటూ కిటికీలోంచి తొంగి చూస్తోంది.

మళ్ళీ చప్పున వచ్చి కుర్చీలో చేరగిల పడింది. బాగా అలసిపోయింది. కొంచెం ఆయాసంగా కూడా వుంది. తనకు తెలి

యకుండానే భయమేస్తున్నట్లు అదిరిపడుతోంది. మధ్య మధ్య తూలుతోంది. గుటకలు వేస్తూ మంచినీళ్ళ గ్లాసెడు గబగబ తాగేసింది.

చప్పున ఎవరో వస్తున్నట్లు మెట్లమీద అలికిడి వినిపించింది. అటు వైపు తిరిగింది. ఆయనకాదు. ఆయన బూట్లచప్పుడు యిట్లా వుండదు. టకటకమని ధ్వని వస్తుంది ఈ రాత్రివేళ యెవరొస్తారు. మొహం కురచ చేసుకుని ఆలోచిస్తోంది. చప్పున తట్టటం లేదు. శరీరంలోంచి వణుకు పుట్టుకొస్తోంది. భయం పూర్తిగా ఆవహించేసింది. హిచ్‌కాక్ పిక్చర్‌లో మెల్లి మెల్లిగా చీకట్లలోంచి మనిషి వస్తున్నట్లుగా ధ్వని మాదిరి చప్పుడు వినిపిస్తోంది. కాళ్ళూ, చేతులు వణికి పోతున్నాయి. గుండెల్లో దడ బయలుదేరింది. కుర్చీలోంచి లేద్దామని యెంత ప్రయత్నంచేసినా లేవలేకపోతోంది. మొహమంతా చెమటలు పట్టేసినాయి. తల వెనక్కు తిప్పేసి ఓరకంటితో మెట్లమీదికి చూస్తోంది. పై మెట్టుమీదికి వచ్చేస్తున్నట్టుగా తెలుస్తుంది. కెవ్వున కేక పెట్టాలనిపించింది. కాని మాట పెగిలి రాలేదు. కుర్చీతో పాటు ఊగిపోతుంది. కుర్చీలోంచి కింద పడిపోతుందేమో అనిపించింది. మేడ మీదకి రాగానే అతన్ని చూసి గతుక్కుమంది. బాగా ఆయాసపడిపోతోంది శ్వాస పీల్చటం తగ్గించుకుంటూ మామూలు పరిస్థితికి రావటానికి ప్రయత్నం చేస్తోంది.

శ్రీధర్‌ను చూసినప్పుడు యింత యిదిగా అదివరకెప్పుడూ భయపడలేదు ఈనాడు అంత ఇదిగా వణికిపోవటానికి కారణమూ అర్థం కావటంలేదు. మనస్సులో ఆందోళనా, ఆందోళనకు తగిన ఊహలు, ఆ ఊహకు అనుగుణంగా వస్తున్న వ్యక్తి అన్నీ తనను

క్రుంగతీసేసినాయి. తన అనుమానమే పెనుభూతమయి ఆవహించింది. మనస్సును స్వైరవిహారానికి వదిలేసింది. తన కంట్రోలు తప్పింది. మనస్సు ఆడించినట్టు ఆడిపోయింది. నిభాయించుకోలేక పోయింది. మనస్సును గట్టిగా పట్టేసి నిలకడగా తీసుకురావటానికి హేమకు పెద్ద సమస్యయిపోయింది. ఆ డిటెక్టివ్ పిక్చర్ని తన కళ్ళల్లోంచి తీసెయ్యటానికి ఎంతగానో తంటాలుపడింది బరువుగా వుంది హృదయం. తన ఆరాటం శ్రీధర్‌కు తెలియనీయకుండానే ఎంతో బిగువుగా "మీరా, రండి" అన్నది.

"థాంక్స్" అంటూ ఓ కుర్చీలాక్కు న్నాడు శ్రీధర్.

"ఏడి కృష్ణ" అంటూ గదంతా కలయ ఒక్క నిమిషం.

"ఇంకా వారింటికి రాలేదు తాపీగా అనేసింది.

'ఈ సమయంలో యితనెందుకు వచ్చినట్టు? వెళ్ళిపొమ్మని డైరెక్ట్‌గా చెప్పేస్తే సరిపోతుంది— అసలే నా మనస్సు బాగా లేదు...' రెండు మూడుసార్లు గుటకలువేసి ఆ ముక్క చెప్పటానికి నోరు తెరవబోతుంటే "కృష్ణ యింట్లోనే వున్నాడనుకున్నాను. ఇవ్వాళ యింత ఆలస్యమయిందేమిటి...?" తల వంచుకున్నాడు శ్రీధర్.

హేమ ఏమీ మాట్లాడలేకపోయింది. కాని బుసలుకొడుతూ ఏం చెప్పాలా ఏమనాలా అని మధనపడుతోంది తీవ్రంగా.

"వస్తూ వుంటాడు..."అంటూనే టేబుల్‌మీద పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

'అసూయలేని అనసూయ'... బాగావుంది టైటిల్.... చదివి

వేశారా.... మీరు చదివింతర్వాత నాకో సారి యివ్వండి. ఈ టైటిల్ బాగా ఎట్రాక్టివ్‌గా వుంది.

అతనితో మాట్లాడే మూడ్‌లో లేదు.

ఆమె మనస్సు మళ్ళీ చంచలమవుతోంది. ఏవేవిటో వచ్చేసి కలవరపెడుతున్నాయి.

"ఈ అసూయ అనేది ఆడవాళ్ళలోనే యెక్కువగా వుంటుం దనుకుంటాను.... సారీ... మీరేమీ అనుకోవద్దు. జనరల్‌గా అంటు న్నాను. ఎక్సెప్షన్స్ ప్రతిదానికీ వుంటాయి...."

"....మీరన్నది నిజమే. అయితే దానికి కారణం మగాళ్ళే అంటాను...." కొరకొర చూసింది. ఆ మాటల్లో కసి, అక్కసూ అంతా వెళ్ళబుచ్చింది.

"కారణాలయితే యెవరికి తోచినవి వాళ్ళు చెప్పుకోవచ్చు. కాని నేనన్నది మాత్రం నిజమని మీరు ఒప్పుకోక తప్పదు...."

"....నా ఉద్దేశం మీకు తెలిసినప్పుడు వేరే నన్నడగటం యెందుకు...." విసురుగా సమాధానం చెప్పింది.

ఆమెలో చిరాకు, అసహనం శ్రీధర్ యిట్టే తెలుసుకున్నాడు.

"మీఅభిప్రాయం యేమిటో కొంతవరకు నేను ఊహించగలుగు తున్నానని మీ రొప్పుకున్నారు, నా కదే చాలు నిండుగా అన్నాడు.

అతని మాటలు చాలా కటువుగా ధ్వనించినాయి. వింతగా అతని మొహంలోకి క్షణం చూసి మొహం చిట్లించేసింది.

అయినా శ్రీధర్ మనస్సు వేరే విధంగా వుంది. ఒంటరిగా అప్పుడప్పుడు హేమతో మాట్లాడటం తటస్థించినా యిలాంటి

సమయం మాత్రం అదివరకెప్పుడూ రాలేదు. ఆమెతో మాట్లాడాలని ఉబలాట పడుతున్నాడు. తన మనస్సు విప్పి చెప్పాలని తహ తహలాడుతున్నాడు.

మీరేమీ అనుకోకండా వుంటే నా మనస్సులో మాట చెపుతాను మీతో మాట్లాడుతున్నంతసేపు నాకు యెంతో హాయిగా వుంటుంది. ఆ సంతోషం చెప్పటానికి వీల్లేదు ... నా ఉద్దేశం .... మీదగ్గర యెన్నో విషయాలు నేర్చుకున్నానంటే నమ్మండి, అసలు మీతో మాట్లాడటం అనేది ఒక పెద్ద ఫీస్ట్ అనుకోండి...." ఉద్వేగం గానూ ఆవేశంగానూ అన్నాడు శ్రీధర్.

హేమ ఆశ్చర్యపడిపోతోంది. ఏమిటీ ధోరణి అని బిత్తర పోతోంది. అంతా అయోమయంగా వుంది. ఎనిమిదిన్నర కూడా అయింది. ఇంకా ఆయన యింటికి రాలేదేమా అని తల్లడిల్లిపోతోంది ఆ ఆందోళన అట్లా వుంటే శ్రీధర్ వచ్చి యిక్కడ కూర్చోవటం ఏవేవో మాట్లాడటం, మరీ అలజడిగానూ, భయంగానూ వుంది.

"చూడండి..." అన్నాడు శ్రీధర్ గుటకలు వేస్తూ.

చప్పున తలెత్తి చూసింది. అతని కళ్ళల్లోకి వాడిగా వేడిగా ఆమె దృష్టులు గుచ్చుకుని పోయినాయి. ఆ తాకిడికి అతని కళ్ళు చెదిరిపోయినాయి. కను రెప్పలు టపటపమనిపిస్తూ తన కుర్చీని యింకొంచెం ముందుకు జరిపాడు శ్రీధర్. ఏదో మాట్లాడాలని అనుకుంటూనే తికమకపడిపోతున్నాడు. అతని వాలకం చూస్తూ హేమ ఉక్కిరి బిక్కిరియి పోయింది.

"....ఈ రాత్రిపూట మీరు ఒంటరిగా వున్నపుడు నేను వచ్చా

నని మీరనుకోవద్దు. నా ఆత్మవిశ్వాసం మీ మంచితనం, కృష్ణ అవగాహన నన్నీ కాసేపైనా కూర్చోబెట్టకలిగినాయి. మీరు నన్ను అపార్థంచేసుకున్నారని నా మనస్సుకు తోచి యిట్లా అంటు న్నాను అంత కంటె యేంలేదు...."

హేమ హృదయం ఒక్కసారిగా తేలికయిపోయినట్లని పించింది. ఆ క్షణంలో శ్రీధర్ మీద అభిమానం గౌరవం పెరిగి పోయినాయి.

శ్రీధర్ లేచి నిలబడ్డాడు

"నమస్తే.... వెళ్లొస్తా ..." అంటూ గంభీరంగా వెనక్కు తిరిగాడు. చప్పున యిట్టే లైట్లు ఆరిపోయినాయి.

హేమ గుండె ఝల్లుమంది. కళ్ళు పొడుచుకున్నా కనిపిం చటం లేదు. కదిలితే ఏమి తగులుతుందో ఎక్కడ కాలుజారుతుందో అన్నట్టుగా ఎవరున్న చోట వాళ్ళుండిపోయారుఇద్దరూను. నిశ్శబ్దం ఆవరించుకుంది. గాలి స్తంభించి పోయినట్లుఉంది. హేమకు గుండె ఆగినంత పనయింది.

మెట్లమీదనుంచి టకటకమని బూట్లుచప్పుడు వినిపించింది. తన హృదయం మీద తొక్కుతున్నట్లుగా తల్లడిల్లి పోయింది. శ్రీధర్ తత్తర పడిపోతున్నాడు. మనస్సు చిక్కపట్టుకోలేక పోతు న్నాడు— కృష్ణ వస్తున్నాడు అని లోపల గుణించుకుంటున్నాడు.

'నేనిప్పుడు యెక్కడకు వెళతాను.... నా కేమిటో భయంగా వుంది....' అంటూ హడలిపోతూ గది తలుపు వెనకాల ఒదిగి ఒదిగి నక్కి, నిలబడ్డాడు.

హేమ కొయ్యబారిపోయింది. నోటమాటలేదు.

కృష్ణ పైమెట్టు మీదికి రాగానే లైట్లు యిట్టే వెలిగినాయి.

వస్తూ వస్తూనే ... "సారీ యివ్వాళ బాగా లేటయింది.... లైట్లు చాలా సేపటినుంచీ లేవా..." హేమ భుజం మీద చెయ్యి వేసి ప్రక్క కుర్చీలో కూర్చున్నాడు.

హేమ శరీరం కంపిస్తున్నట్టుగా అనిపించింది— ఆమె వేడి నిట్టూర్పులు ఘాటుగా తాకినాయి.

"ఏమిటి హేమా అట్లా వున్నావు......" చెక్కిళ్ళమీద రెండు చేతులూ పెట్టి అమె మోహంలోకి దగ్గరగా చూశాడు.

ఆమె యేమీ మాట్లాడలేకపోతోంది. "ఏమీ.... లేదు...." అంటూ పేలవంగా భర్త మొహంలోకి చూస్తూ నవ్వటానికి పెనుగులాడింది.

కృష్ణ లేచి నిలబడి గది తలుపులు రెండూ వెయ్యబోయాడు.

అశ్చర్యంగా "ఆ!.... శ్రీధర్.... నువ్వా!...." అంటూ బిత్తర పోయాడు. ఆతనివైపు హేమవైపు తీక్షణంగానూ, తీవ్రంగానూ చకచక చూశాడు. ఒళ్ళు ఉడికిపోయింది. తల బరువెక్కింది.

"హేమా!...." పళ్లు పటపట మనిపిస్తూ గట్టిగా అరిచాడు కృష్ణ. గదంతా దద్దరిల్లిపోయేటట్టు.

— ౦ —